సాక్షి సిద్దిపేట

ఆదివారం ; 10 ; నవంబర్ ; 2024



గ్రామాల అభివృద్ధికి కృషి

గ్రామాల అభివృద్ధి కోసమే వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని సినీ నిర్మాత సురేశ్‌బాబు తెలిపారు. వివరాలు 8లో



ఉత్సాహంగా క్రీడా పోటీలు

హుస్నాబాద్ మినీ స్టేడియంలో 98వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. వివరాలు 8లో



ఆదర్శంగా గిరిజన విద్యార్థులు

గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో సీట్లు సాధించి రాష్ట్ర విద్యార్థులకే ఆదర్శంగా నిలిచారని మంత్రి సీతక్క ప్రశంసించారు. వివరాలు 9లో

న్యూస్‌రీల్

నేడు బండి సంజయ్ రాక

హుస్నాబాద్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పట్టణ పరిధిలోని (పొట్లపల్లి రోడ్డు) తాటి వనంలో తన సొంత ఖర్చులతో వేసిన బోరు మోటార్లను ప్రారంభిస్తారు. అనంతరం గౌడ కులస్తుల కుటుంబాలతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

11న బహిరంగ వేలం పాట

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణ శివారులో సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లేఔట్ స్థలాల విక్రయాల్లో భాగంగా బహిరంగ వేలం పాటను ఈనెల 11, 20వ తేదీల్లో నిర్వహించనునట్టు సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సుడా లేఔట్ విక్రయాలలో భాగంగా మిగిలిన 90 ప్లాట్లకు సంబంధించి వేలం పాట ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు సుడా కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి



మందాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్‌లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మందాపూర్, వట్టిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. రైతులు వడ్లను ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు యశ్వంత్‌రెడ్డి, శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రవి, తిరుపతిరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన

డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య



లచ్చపేటలో కులగణన సర్వేలో పాల్గొన్న డీఆర్‌డీవో పీడీ జయదేవ్ ఆర్య, డీఎస్‌ఓ తనూజ

దుబ్బాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని డీఆర్‌డీఏ పీడీ, దుబ్బాక నియోజకవర్గ ప్రత్యేక అధికారి జయదేవ్ ఆర్య అన్నారు. శనివారం డీఎస్‌ఓ తనూజతో కలిసి దుబ్బాక మున్సిపాల్టీలోని లచ్చపేట, మండలంలోని రామక్కపేటలో కులగణన ప్రక్రియను పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో కలసి పలు ఇళ్ల వద్దకు స్వయంగా వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికించే కార్యక్రమం పూర్తి అయిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర శర్మ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్, ఎంఈఓ ప్రభుదాసు, కౌన్సిలర్ బంగారయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'చెలిమి' చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ సభ్యులు చేయూత అందించారు. పదోవార్డులోని రామాలయం ప్రాంతానికి చెందిన చిక్కుడు కిరణ్ ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆ కుటుంబ సభ్యులకు రూ.11,500 నగదుతో పాటు రూ.3,500 విలువైన నిత్యావసర సరుకులను అందించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్కడైనా ఒకే చోట నమోదు చేసుకోవాలి



కలెక్టర్ మనుచౌదరి

- ఇంటింటి సమగ్ర సర్వే కోసం 2,538 మంది ఎన్యుమరేటర్లు
- పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి
- 3,750 మంది ఆపరేటర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం
- 'సాక్షి'తో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సాక్షి, సిద్దిపేట: సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించి, వివరాలు చెప్పాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు ఇంకా పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని.. ఇప్పటికే ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు అంటించారని, ఒక్కరు .. ఒకే దగ్గర నమోదు చేయించుకోవాలని చెప్పారు. కుటుంబ సమగ్ర సర్వే గురించి శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 గృహాలు

జిల్లాలో 3,45,312 నివాస గృహాలుండగా సర్వే కోసం 2,538 మంది ఎన్యుమరేటర్లు, 252 మంది సూపర్‌వైజర్లను నియమించాం. అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ పర్యవేక్షిస్తున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నివాస గృహాల చొప్పున కేటాయించాం. ఉపాధ్యాయులు ఉదయం సమయంలో స్కూల్‌లో పాఠాలు బోధించి మధ్యాహ్నం సర్వేను చేపట్టనున్నారు. ఉపాధ్యాయులు పనిచేసే చోట, ఆ పక్క ప్రాంతానికే సర్వే బాధ్యతలను అప్పగించాం. ఇప్పటికే ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ పెద్ద పేరు, ఫోన్ నంబర్‌లను సేకరించి ఇంటికి ప్రభుత్వం అందించిన స్టిక్కర్‌ను అంటిస్తున్నారు.

ప్రారంభమైన పూర్తి స్థాయి సర్వే

పూర్తి స్థాయి సర్వే శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ సర్వే నెలాఖరు వరకు కొనసాగనుంది. ఆయా మండలాలకు సర్వే దరఖాస్తులు ఇప్పటికే 40శాతం చేరుకున్నాయి. రేపటి వరకు వంద శాతం దరఖాస్తులు అందుతాయి. 75 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు అన్ని సరిగా నమోదు చేయాలి. సర్వే పూర్తయిన వాటిని త్వరలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. వీటి గురించి అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఉన్న కంప్యూటర్‌లలో ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తాం. 3,750 మందిని కంప్యూటర్ ఆపరేటర్‌లను తీసుకోనున్నాం.

ఆధార్ ఎక్కడుంటే అక్కడే..

అద్దె గృహాల్లో, వలస వచ్చిన వారు ఒకే దగ్గర నమోదు చేయించుకోవాలి. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు అక్కడే చేసుకునే అవకాశం కల్పించాం. జీవనోపాధి కోసం వలస వెళ్లిన వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డులు ఎక్కడ ఉంటాయో అక్కడే నమోదు చేసుకోవాలి. తాళం వేసి ఉన్న ఇళ్లకు రెండోసారి కూడా వస్తారు.

పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి

సర్వేలో భాగంగా ఆయా కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లకు అందివ్వాలి. అందుకోసం ఆధార్, పట్టా పాస్‌బుక్, ఆహార భద్రత కార్డు, విద్యుత్ బిల్లు తదితర డాక్యుమెంట్లు అన్ని అందుబాటులో ఉంచుకోవాలి. ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు వివరాలు వెంటవెంటనే చెప్పడం వలన త్వరగా సర్వే పూర్తవుతుంది. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా ఇంటికి ప్రభుత్వ ఐడీ కార్డుతో వచ్చే ఎన్యుమరేటర్‌కు వివరాలు అందించాలి. వివరాలు ఇస్తే సర్వే సమగ్రంగా పూర్తవుతుంది. ప్రజల సమగ్ర కుటుంబ సమాచారం వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడుతుంది.

ఏమైనా ఇబ్బందులున్నాయా..?

- కలెక్టర్ చౌదరి ఆరా
- ఏ ఒక్కరూ మిస్ కావొద్దని సూచన



సిద్దిపేటలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేటజోన్/ములుగు(గజ్వేల్)/కొండపాక(గజ్వేల్): కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి శనివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. సిద్దిపేటలోని 33వ వార్డులో, ములుగు, కొండపాక మండలం దుద్దెడలో జరిగిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. మొదటి రోజు కాబట్టి ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా..? అని ఆరా తీశారు. ఒకవేళ ఇబ్బందులు ఉంటే ఏరియా సూపర్‌వైజ్, ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఏ ఒక్కరూ కూడా మిస్ కాకుండా సర్వే నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేస్తామన్నారు. సుమారు 57 అంశాలపై వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్యుమరేటర్లకు ఒక్కొక్కరికి ఒక సహాయకులను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక బ్లాక్ పరిధిలో ఒక ప్రత్యేక ఎన్యుమరేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ సదానందంకు సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేను లోపాలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. కాగా, కుకునూరుపల్లి, రాంపూర్ గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను జిల్లా అదనపు కలెక్టరు అబ్దుల్ హమీద్ పరిశీలించారు. కలెక్టర్ వెంట సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, ములుగు, కొండపాక తహసీల్దారులు ప్రవీణ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, ములుగు ఎంపీడీఓ శర్మ పాల్గొన్నారు.

హరిద్రకు హారతి



నాచగిరి హరిద్ర నదిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హరిద్రానది తీరం శనివారం రాత్రి కార్తీక దీపోత్సవ వేడుకలతో అలరారింది. నాచగిరి భక్తజనం నదీహారతి తిలకించి పరవశించింది. కార్తీక దివ్వెలను వెలిగించి నదిలో వదిలి మహిళలు పునీతులయ్యారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఈఓ అన్నపూర్ణ నదీ తీరంలో కుంభహారతి, నక్షత్రహారతి ఇచ్చారు. దీపోత్సవంలో భక్తులు పాల్గొని తరించారు. - వర్గల్(గజ్వేల్)



హారతి ఇస్తున్న ఈఓ అన్నపూర్ణ

రెవెన్యూ డివిజన్ కోసం పోరాటం

సీపీఎం రాష్ట్ర నేత కనకారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ ఏర్పాటు కోసం పోరాటాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.కనకారెడ్డి అన్నారు. చేర్యాలలో శనివారం జరిగిన సీపీఎం 20వ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు నియోజకవర్గ కేంద్రం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా అనేక పోరాటాలు చేశామన్నారు. చేర్యాల అస్తిత్వాన్ని కాపాడాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలను కలిపి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి, పాత చేర్యాల నియోజకవర్గాన్ని పునరుద్ధరించే వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఎం నాయకులు శ్రీహరి, శోభ, ప్రభాకర్, మల్లారెడ్డి, గోపాలస్వామి, వెంకట్, రవికుమార్, అరుణ్‌కుమార్, ప్రశాంత్, నాగరాజు, నర్సారెడ్డి, భాస్కర్, రంజిత్‌రెడ్డి, మల్లేశం, అశోక్, చందు తదితరులు పాల్గొన్నారు.

'చిరు' దివ్యౌషధం!

డీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల వంటలు

- బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్‌తోపాటు 30 రకాలు
- ప్రజలకు నోరూరిస్తున్న రుచులు
- పుష్కలంగా పీచు పదార్థాలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపశమనం



పౌష్టికాహారం తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. ఆరోగ్యమే మహాభాగ్యం. మంచి ఆహారం తీసుకుంటే మనిషికి శక్తితో పాటు ఆయుష్ కూడా పెరుగుతుంది. కానీ ఇప్పుడున్న ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు కల్తీ ఆహారాన్ని తినాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రజలకు నాణ్యత గల ఆహారం అందించేందుకు కొన్ని రెస్టారెంట్లు ముందుకొచ్చాయి. అందులో ఒకటే మన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని కేఫ్ గ్రీన్ ఎత్నిక్ రెస్టారెంట్. ఇక్కడ కేవలం చిరుధాన్యాలతోనే వంటలు తయారు చేసి ప్రజలకు రుచికరమైన భోజనం అందిస్తారు. సాధారణంగా ఎక్కడైనా సరే బియ్యం, మైదా పిండిని పలు రకాల ఆహార పదార్థాలు చేసేందుకు వాడుతుంటారు. కానీ ఇందులో ఏ టిఫిన్ అయినా, ఎలాంటి భోజనమైనా సరే మిలెట్స్‌తో తయారు చేయడమే ఈ హోటల్ ప్రత్యేకత. 8లో

- మాతంశెట్టి మల్లన్న
- జహీరాబాద్ టౌన్



రైతుల తరఫున పోరాడుతాం

- హామీలు అమలు చేసేదాకా వదిలి పెట్టం
- రుణమాఫీ, రైతుభరోసా నేటికీ ఇవ్వలేదు
- రైతు దీక్షలో మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ

కొల్చారం(నర్సాపూర్): సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం మండల కేంద్రం కొల్చారంలో నిర్వహించిన రైతు గర్జన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ, రైతు భరోసా నేటికీ ఇవ్వలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో రుణమాఫీ చేస్తానంటూ దేవుళ్లపై ఒట్టు వేసి పూర్తిస్థాయిలో మాఫీ చేయకుండా మోసం చేశారని వాపోయారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. చిన్నఘనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఒక్క రైతుకు రుణమాఫీ కాలేదని తెలిపారు. ఈ విషయం తప్పని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడు రైతులు రోడ్డెక్కిన పరిస్థితి లేదన్నారు. ధాన్యం కొనుగోలుకు లేనిపోని తిరకాసు పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని, రైతుల తరఫున పోరాటానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

హరీశ్.. చిల్లర వేషాలు మానుకో..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అవసరమైతే తన ఆస్తులను రైతులకు కేటాయిస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు ఓట్ల రాజకీయం కోసం రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది కుటుంబాలను రోడ్డుపైన పడేశారని, ఇప్పుడు రైతుల వెంట పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో సీఎం జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తుంటే, సమస్యలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తాను అన్ని ఆటల్లో ఆల్‌రౌండర్‌గా ఉన్నానని, ఇప్పటికైనా హరీశ్‌రావు చిల్లర వేషాలు మానుకోవాలని హితవు పలికారు.

అనుసంధానం అంతంతే...?

- స్థానిక మార్కెట్లకే పరిమితమైన 'ఈ–నామ్'
- పూర్తిస్థాయి అనుసంధానం చేస్తేనే రైతులకు మెరుగైన ధర
- ప్రస్తుత సీజన్‌లో కార్యాచరణపై ఆశలు

గజ్వేల్ మార్కెట్ యార్డుకు శనివారం 10 మంది రైతులు 90 క్వింటాళ్ల మక్కలను 'ఈ–నామ్'(నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్)లో అమ్ముకోవడానికి వచ్చారు. మక్కలకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,225 ఉండగా, వ్యాపారులు పోటీ పడి క్వింటాలుకు రూ.2,300–2,470 చెల్లించారు. దీన్ని బట్టి చూస్తే మద్దతు ధర కంటే అధికంగా రూ.75–245 చెల్లించారు. తెలంగాణలోని కొన్ని మార్కెట్లకే అనుసంధానం ఉండటం వల్ల ఈ ధర లభించింది. ఒకవేళ దేశంలోని ప్రధాన మార్కెట్లతో అనుసంధానం చేసి ఉంటే ఇంకా మెరుగైన ధర లభించి ఉండేది.

గజ్వేల్: రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డుల్లోకి తీసుకురావడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల ఏటా తీవ్ర నష్టాలను కలిగిస్తున్నది. గ్రామస్థాయిలో వ్యాపారులు అందుబాటులో ఉండటం వల్ల ఏ ఉత్పత్తులైనా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.500–1,000కి తక్కువకు అమ్ముకుంటున్నారు. దీని వల్ల సరుకు రవాణా చార్జీలు, శ్రమ తగ్గుతుందని భావిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు వ్యాపారులు.. తరుగు పేరిట, తూకాల్లో మోసాలకు పాల్పడడం పరిపాటిగా మారుతోంది.

'ఈ–నామ్'పూర్తిస్థాయి అనుసంధానంతోనే మేలు

జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, చిన్నకోడూర్, నంగునూర్, తొగుట, దౌల్తాబాద్, కొండపాక, మిరుదొడ్డి, దుబ్బాక, బెజ్జంకి, హుస్నాబాద్, కొహెడ, చేర్యాల, వంటిమామిడి మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిల్లో పత్తి, వరి, మొక్కజొన్న ఇతర వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లు సాగుతుంటాయి. ఇందులో గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ మార్కెట్లలో కొన్నేళ్లుగా ఈ విధానం అమల్లో ఉన్నది. వ్యాపారుల్లో పోటీతత్వాన్ని పెంచి రైతులకు మద్దతు ధరకు మించిన మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రవ్యాప్తంగా 50కిపైగా మార్కెట్ కమిటీల్లో ఈ–నామ్ అమల్లో ఉంది. ఇందులో కొన్ని ప్రధాన మార్కెట్లకూ దేశంలోని ప్రముఖ మార్కెట్లకు అనుసంధానం చేసి...లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు హర్యానా మార్కెట్‌లో ఉన్న ఓ వ్యాపారికి ఇక్కడి ఉత్పత్తులు నచ్చితే..ఈనామ్ ద్వారా కొనుగోలు చేసి మంచి ధర చెల్లించే అవకాశమున్నది. కానీ రాష్ట్రంలోని కొన్ని మార్కెట్లకు మాత్రం స్థానిక స్థాయిలో అవకాశం కల్పించారు. దీనివల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. గజ్వేల్‌లో మార్కెట్లలో 58 మంది లైసెన్స్ పొందిన వ్యాపారులు, 9మంది కమీషన్ ఏజెంట్లు ఉండగా.. ఈ–నామ్ ద్వారా పత్తి, మక్కల కొనుగోళ్లను జరుపుతుంటారు. ఈ లెక్కన మంగళవారం ఈ–నామ్ ద్వారా మక్కలకు రూ.2,225 మద్దతు ఉండగా, అంతకు మించి రూ.2,300–2,470 చెల్లించారు. పత్తికి మాత్రం కేవలం రూ.6,550–6,690 మాత్రమే పలికింది. 101 క్వింటాళ్ల పత్తిని రైతులు ఇక్కడికి తీసుకొచ్చారు. పత్తికి మద్దతు ధర రూ.7,121–7,521 ఉన్న సంగతి తెలిసిందే.

ధరల విధానం ఇదీ..

'ఈ–నామ్'లో వ్యాపారులు పోటాపోటీగా ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా ధరలను కోట్ చేయడం వల్ల అధికంగా వేసిన వ్యాపారికి ఉత్పత్తులు దక్కుతాయి. ఈ విధానంలో అధికంగా కొనుగోళ్లు జరిగితే...రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. కానీ రైతులు ఈ విధానంలో విక్రయాలు జరపాలనే అవగాహన లేక లావాదేవీలు నామమాత్రంగా సాగుతున్నాయి. నిజానికి బయట లక్షల క్వింటాళ్లల్లో లావాదేవీలు జరుగుతుండగా, 'ఈ–నామ్'లో మాత్రం నామమాత్రంగా సాగుతున్నాయి. గజ్వేల్‌లోనే సిద్దిపేట, హుస్నాబాద్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.



గజ్వేల్‌లో ఈ-నామ్ ద్వారా పత్తి కొనుగోళ్లు

'ఈ-నామ్'సక్రమంగా అమలయ్యేలా చూస్తాం

'ఈ–నామ్'మంచి విధానం. దీని ద్వారా రైతులు పండించిన ఉత్పత్తులకు మెరుగైన ధర అందే అవకాశమున్నది. జిల్లాలో ఈ విధానం సక్రమంగా అమలయ్యేలా చూస్తాం.

ప్రసాదరావు
మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్

క్లుప్తంగా

ఇన్నోవ్‌హాక్ విజయవంతం



బహుమతులు అందజేస్తున్న కాలేజీ డైరెక్టర్, ఇతర ప్రతినిధులు

నర్సాపూర్: ఇన్నోవ్‌హాక్–2024 విజయవంతమైందని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. రెండు రోజుల పాటు కాలేజీలో నిర్వహిస్తున్న ఇన్నోవ్‌హాక్ శనివారం ముగియడంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కాలేజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 24 గంటల బిమతాన్ ఇన్నోవ్‌హాక్–2024 కార్యక్రమం చేపట్టారని, తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రముఖ కాలేజీలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ దూబె, సివిల్ హెచ్‌ఓడీ కృష్ణారావు మేనేజర్ బాపిరాజు, సిబ్బంది నాగరాజు, అభయ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

దుబ్బాకరూరల్: పిచ్చికుక్క దాడి చేయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన దుబ్బాక మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు. గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఏడుగురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన లక్ష్మి, లచ్చవ్వ, ఎండీ షబానాతోపాటు మరో నలుగురికి తీవ్ర గాయాలు కాగా సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి

మిరుదొడ్డి(దుబ్బాక): తేనెటీ గల దాడిలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే .. ధర్మారం వద్ద కొనుగోలు కేంద్రంలో ఒక్కసారిగా తేనెటీలు రైతులపై దాడి చేశాయి. రైతులు కొనుగోలు కేంద్రంలో చెల్లాచెదురుగా పారిపోయారు. ఘటనలో గ్రామానికి చెందిన కనకయ్య, లక్ష్మీ దంపతులకు గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యాను బోల్తా పడి కూలీలకు

చేగుంట(తూప్రాన్): వ్యాను బోల్తాపడి కూలీలకు గాయాలైన ఘటన మాసాయిపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఓ ప్రైవేటు విత్తన పరిశ్రమకు సంబంధించిన కూలీలను వ్యానులో తీసుకెళ్తున్నారు. మాసాయిపేట శివారులోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడటంతో కూలీలు సంజయ్, ముఖేశ్, మసురాం, రోషన్, అఫ్జల్, దీపక్, లాలూకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

క్వారీలో మృతదేహం లభ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): క్వారీలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని మల్గి గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ చల్ల రాజశేఖర్ కథనం మేరకు.. శనివారం ఉదయం గ్రామానికి చెందిన కొందరు కంకర క్రషర్ల క్వారీలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృత దేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తించ లేకుండా ఉందని, మృతుడి వయస్సు సుమారు 34 ఏళ్లు ఉండొచ్చని ఎస్‌ఐ తెలిపారు. ఘటనా స్థలం వద్దే డాక్టర్‌ను పిలిపించి పోస్టు మార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'చిరు' దివ్యౌషధం!

జహీరాబాద్‌లో కెఫే గ్రీన్ ఎథ్నిక్ | చిరుధాన్యాలతో వంటలు తయారీ





జహీరాబాద్‌లోని కెఫే గ్రీన్ ఎథ్నిక్ రెస్టారెంట్

సిరి ధాన్యాలతో రుచికరమైన వంటకాలు వండి వడ్డిస్తూ కస్టమర్ల ఆదరాభిమానాలు కొల్లగొడుతోంది జహీరాబాద్ పట్టణంలోని కెఫే గ్రీన్ ఎథ్నిక్ రెస్టారెంట్. ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చిరుధాన్య రుచులతో ఈ హోటల్ ఏర్పాటు చేశారు. వీటిలో పోషక విలువలు, మాంసకృతులు, పీచు పదార్థాలు పుష్కలం కలిగి ఉండటంతో ప్రజలు తినడానికి ఆసక్తి చూపుతున్నారు.



మిల్లెట్స్ వంటకాలు ఇంట్లో చేసుకుకోవడం కొంత రిస్క్‌తో కూడుకున్న పని. చాలా మందికి వీటిని వాడడం, వండడం తెలియదు. అలాంటి వారికి కోసం జహీరాబాద్ పట్టణంలో డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కెఫే ఏర్పాటు చేశారు. చిరు ధాన్యాలతో వంటలు తయారు చేసి హైజినిక్‌గా అందిస్తున్న కెఫే గ్రీన్ ఎథ్నిక్ హోటల్‌పై ప్రత్యేక కథనం..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ పరిధిలో 1983 సంవత్సరంలో డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఏర్పాటైంది. సొసైటీ ఈ ప్రాంతంలోని జీవ వైవిధ్య పంటల పరిరక్షణకు కృషి చేస్తుంది. నియోజకవర్గం పరిధిలో పండే తృణ ధాన్యాలతో ఆహారం అందించడానికి 2006 సంవత్సరంలో రాష్ట్రంలోనే మొదటిసారి కెఫే గ్రీన్ ఎథ్నిక్ హోటల్‌ను ప్రారంభించారు. సుమారు 30 రకాల వంటలను అందుబాటులో ఉంచారు. పల్లెటూర్ వాతావరణం, పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేసిన మిల్లెట్ రెస్టారెంట్‌ను మహిళలే నిర్వహిస్తుంటారు. పోషకాలతో కూడిన చిరు ధాన్యాల వంటలు సరసమైన ధరలకు అందించడంతో ప్రజలు వీటిని తినడానికి ఇష్టపడుతున్నారు. షుగర్, బీపీ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు మిల్లెట్స్ రుచులను ఆస్వాదిస్తున్నారు. సామాన్య ప్రజలు కూడా చిరుధాన్యాల వంటల తినడానికి ఆసక్తి చూపుతున్నారు.

చిరు ధాన్యాలతో రకరకాల వంటలు

కెఫే ఎథ్నిక్ గ్రీన్ హోటల్‌లో అన్ని రకాల వంటలు లభిస్తాయి. మార్కెట్‌లోని హోటల్‌లో లభించే రెగ్యులర్ ఫుడ్ ఇక్కడ దొరుకుతుంది. కానీ వంటకాలన్నీ మిల్లెట్స్‌తో తయారు చేస్తారు. బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్‌కు సంబంధించిన ప్రతీ ఒక్కటి మిల్లెట్స్‌తో తయారు చేస్తారు. ఉదయం ఇడ్లీ, దోశ, పూరి తదితర రకాల టిఫిన్స్, మధ్యాహ్నం లంచ్‌లో జొన్న, రాగి, కొర్ర, సజ్జ తదితర రకాల రొట్టెలు, కిచిడీ, పాయసం, అంబలి, సాయంత్రం స్నాక్‌లో మిర్చీ బజ్జీ, స్వీట్స్ తదితర ఐటమ్‌లు తయారు చేసి కస్టమర్లకు హైజినిక్‌గా అందిస్తున్నారు.



రొట్టెలు చేస్తున్న మహిళ

బిర్యానీ, ఫ్రైడ్ రైస్..

రాత్రిపూట డిన్నర్‌లో కూడా వేడి వేడిగా మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటలు వడ్డిస్తుంటారు. మిలెట్స్‌తో తయారు చేసిన బిర్యానీ, ఫ్రైడ్ రైస్, పులిహోర అన్ని రకాల వెరైటీలు లభిస్తాయి. పండగల సమయంలో ఈ ప్రాంత ప్రజలు ఇంట్లో తయారు చేసుకునే నువ్వుల బక్షాలు, స్వీట్స్, పొంగలి తదితర వంటలను తయారు చేసి కస్టమర్లకు అందిస్తున్నారు. బయట మార్కెట్ తరహాలోనే ఇక్కడి వంటల ధరలు ఉన్నాయి. జహీరాబాద్‌లోని కెఫే ఎథ్నిక్ రెస్టారెంట్‌లో దొరికే ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఇక్కడికి రావడంతో మంచి స్పందన వస్తుంది. హోటల్‌లో మొత్తం 15 మంది పని చేస్తారు. 11 మంది మహిళలు కాగా నలుగురు పురుషులు. రెస్టారెంట్ ప్రతి రోజూ ఉదయం 7.30 ప్రారంభమై రాత్రి 9.30 గంటలకు క్లోజ్ అవుతుంది. ఇక్కడ వంటలన్నీ కట్టెలపైనే వండుతారు. బయట హోటల్‌లో మాదిరిగా ఇక్కడ ధరలు ఉంటాయి.

మహిళా రైతులతో పంటలు..

డీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న కెఫే గ్రీన్ ఎథ్నిక్ రెస్టారెంట్‌లో పాత పంటలతో వంటలు చేస్తారు. సొసైటీలో సభ్యులైన మహిళా రైతులను డీడీఎస్ ప్రోత్రహించి వారి పొలాల్లో చిరుధాన్యాలను సాగు చేయిస్తుంది. విత్తనాలు, ఎరువులు తదితర పెట్టుబడి ఖర్చులను కూడా సంస్థ తోడ్పాటు అందిస్తుంది. అనంతరం సొసైటీనే పంటలను కొనుగోలు చేసి మార్కెటింగ్ చేస్తుంది. డీడీఎస్‌కు సంబంధించి స్టోర్ కూడా ఉంది. అక్కడే చిరుధాన్యాలను నిల్వుంచి విక్రయిస్తారు. హోటల్‌కు కావాల్సిన ఆహార పదార్థాలు అక్కడి నుంచే వస్తాయి.



జహీరాబాద్ ప్రాంత మహిళలు పండించిన చిరుధాన్యాలు

రెస్టారెంట్‌లో మెనూ (రూపాయల్లో..)

బ్రేక్ పాస్ట్‌లో ఇండ్లీ రూ.40, ఇండ్లీ వడ 50, వడ 50, పూరి 50, సెట్ దోశ 50, దోశ 50 ఉన్నాయి. అలాగే, లంచ్ అండ్ డిన్నర్‌లో మీల్స్ రూ.100, కిచిడీ 60, రోటీకర్రీ 60, జొన్న పొంగల్ 80, మిల్లెట్ బిర్యానీ 120, కర్డ్ రైస్ 80, ఫ్రైడ్ రైస్ 80, సజ్జరాగి రోటీ కర్రీ రూ.70, బిసిబెళిబాత్ 80, పులిహోర 80, పోలెలు(బక్షాలు) ఒక్కటి రూ.30 అందుబాటులో ఉంటాయి. అలాగే, స్నాక్స్ మిర్చి బజ్జీ ప్లేట్ 50, పకోడి 50, పునుగులు 50, కాన్ సమోస 50, రాగి మాల్ట్ 30, బటర్ మిల్క్ 20, లెమన్ జూస్ 20 లభిస్తాయి. అలాగే స్వీట్స్ తక్కువ ధరకే అమ్మకాలు జరుపుతున్నారు. కొర్ర, రాగి, జొన్న లడ్డూలు రూ.25, రాగి సున్నుండలు రూ.30, కొర్రబాదుషా రూ.25కే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.



మిల్లెట్స్ వంటల రుచి చూస్తున్న ప్రజలు

లాభాలు ఆశించకుండా..



కనుమరుగవుతున్న చిరు ధాన్యాల పంటలు రక్షించేందుకు డీడీఎస్ కృషి చేస్తుంది. మహిళలను ప్రోత్సహించి వారి ద్వారా పంటలను పండిస్తూ ప్రజలకు అందించడానికి ఈ హోటల్‌ను ఏర్పాటు చేశాం. మిల్లెట్స్ వంటలను ఈతరం వారికి పరిచయం చేసేందుకు లాభాలు ఆశించకుండా కెఫే ఎథ్నిక్ రెస్టారెంట్‌ను నడుపుతున్నాం. హోటల్ ద్వారా రూ.లక్షలు సంపాదించాలన్న ఉద్దేశ్యం లేదు. చిరుధాన్యాలు అందరూ తినాలన్న ఉద్దేశ్యంతో నష్టాలు వస్తున్నా రాజీ పడకుండా రుచికరమైన వంటలు తయారు చేస్తున్నాం.

– అనురాధ, రెస్టారెంట్ మేనేజర్

తరుచూ కెఫేలో భోజనం చేస్తా



చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు శరీరానికి చాలా మంచివి. ఆరోగ్య గురించి శ్రద్ధ చూపేవారు ఈ హోటల్‌లో భోజనం చేస్తుంటారు. తాను కూడా కెఫే ఎథ్నిక్‌కు వస్తుంటాను. కొర్రలు, సజ్జలు తదితర గింజలతో తయారు చేసిన వంటకాలను ఇష్టం. ముఖ్యంగా రొట్టెలు, కిచిడీ కూడా తింటాను. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు డైట్‌లో చిరు ధాన్యాలతో చేసిన వంటలు తీసుకుంటే చాలా మంచిది.

– రాములు నేత, జహీరాబాద్

నాలుగేళ్లుగా పని చేస్తున్న



నా పేరు అనిల్. మాది జహీరాబాద్ మండలంలోని అనేగుంట తండా. కెఫే గ్రీన్ ఎథ్నిక్ రెస్టారెంట్‌లో నాలుగేళ్లుగా పనిచేస్తున్న. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు వర్క్ చేస్తా. ఈ హోటల్‌లో తృణ ధాన్యాలతో తయారు చేసిన అన్ని రకాల వంటలు వండుతారు. ఆరోగ్యం గురించి ఎక్కువగా పట్టించుకునే వారు రెగ్యులర్‌గా వస్తుంటారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కూడా ఇక్కడ భోజనం చేస్తుంటారు.

–అనిల్, హోటల్ వర్కర్

అనారోగ్య సమస్యలు నివారణ



చిరుధాన్యాలు అనేక అనారోగ్య సమస్యలను నివారిస్తాయి. చిరుధాన్యాల్లో ఫైబర్, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, కాల్షియం, జింక్, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ప్రొటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. పెరుగుతున్న పిల్లలు, వృద్ధులకు ఎంతో మేలు చేస్తాయి. అధిక రక్తపోటు, గుండెకు సంబంధించిన రోగాలను సమర్థమంతంగా తగ్గిస్తుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. వీటిని రోజువారి ఆహారంలో చేర్చుకుంటే ప్రయోజకరంగా ఉంటుంది.

– డాక్టర్. శివబాబు, జహీరాబాద్

గ్రామాల అభివృద్ధికి విజ్ఞాన జ్యోతి కృషి

● సినీ నిర్మాత, సొసైటీ అధ్యక్షుడు సురేశ్ బాబు



సమ్మేళనంలో మాట్లాడుతున్న సురేశ్ బాబు

కొడిపల్లి(నర్సాపూర్): గ్రామాల అభివృద్ధి కోసమే విజ్ఞాన జ్యోతి సొసైటీ ద్వారా ఇక్కడ గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ, వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేశామని ప్రముఖ సినీ నిర్మాత, సొసైటీ అధ్యక్షుడు సురేశ్‌బాబు తెలిపారు. విజ్ఞాన జ్యోతి విద్యార్థులు ఎంటర్ ప్రైజెస్‌లు ఏర్పాటు చేస్తే రూ.2.50 లక్షలు సాయం అందిస్తామని పేర్కొన్నారు. శనివారం కొడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ, వ్యవసాయ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సురేశ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఇతరులకు సహాయం చేయాలన్నారు. అనంతరం డైరెక్టర్ అర్జునరావు మాట్లాడుతూ.. ఇక్కడి విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మంది ఏఈఓలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కే.దుర్గాప్రసాద్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుతరాంప్రసాద్, మాజీ డైరెక్టర్ కేఎస్ రావు, మాజీ అధ్యక్షుడు డీఎస్ రావ్, డిప్యూటీ సీఈఓ సంజయ్‌కుమార్, విజ్ఞాన జ్యోతి డిగ్రీ కాలేజ్ డిప్యూటీ డైరెక్టర్ అరుణకుమారి, డైరెక్టర్లు అర్జునరావు, దేవేందర్ రెడ్డి, ఫీల్డ్ మేనేజర్ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

రాయికోడ్(అందోల్): ఓ వ్యక్తి హత్యకు కారకులైన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసుకు సంబంధించిన వివరాలను జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు, రాయికోడ్ ఎస్‌ఐ నారాయణ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన మహాలక్ష్మికి పదిహేనేళ్ల కిందట ఇందూర్ గ్రామానికి ఎస్.సంగమేశ్‌తో వివాహమైంది. వీరికి కుమారుడు భానుప్రసాద్, కూతురు వైష్ణవి ఉన్నారు. భార్యాభర్తలు తరుచూ గొడవ పడేవారు. ఇదే క్రమంలో పదేళ్ల కిందట పెద్దశంకరంపేట మండలానికి చెందిన రజితను సంగమేశ్ రెండో వివాహం చేసుకొని హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. మొదటి భార్య పిల్లలను తన వెంటే తీసుకెళ్లి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో మొదటి భార్య, కుటుంబీకులు సంగమేశ్‌పై కక్ష పెంచుకున్నారు. అక్టోబర్ 30న సంగమేశ్ తండ్రి పెంటయ్య(65), పిల్లలతో రాయికోడ్ నుంచి ఇందూర్‌కు ఆటోలో వెళ్తున్నాడు. విషయం పసిగట్టిన మహాలక్ష్మి, ఆమె తల్లి, మేనమామలు, సోదరులు పీపడ్‌పల్లి గ్రామ శివారులో సంగమేశ్‌ను, పెంటయ్యను తీవ్రంగా గాయపర్చారు. గాంధీ ఆస్పత్రిలో తండ్రీకొడుకులు చికిత్స పొందుతుండగా పెంటయ్య మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులైన మహాలక్ష్మి కుటుంబీకులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందుతుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి వేధింపులకు గృహిణి ఆత్మహత్య

మర్కుక్(గజ్వేల్): యువకుడి వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ దామోదర్ వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఇస్తారి రమేశ్‌కు మూడేళ్ల కిందట కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మండలం కల్యాణి గ్రామానికి చెందిన ప్రియాంక(24)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గ్రామానికి చెందిన కుంట భాస్కర్ అనే యువకుడు కొద్దిరోజులుగా ప్రియాంకను మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయం అతడి తల్లి కిష్టవ్వకు చెప్పగా మందలించింది. అయినా తనలో మార్పు రాకపోగా వేధింపులు ఎక్కువ కావడంతో ఆందోళనకు గురైన ప్రియాంక శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేయగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

గోశాలలో ఉరేసుకొని వ్యక్తి

కొడిపల్లి(నర్సాపూర్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కుషన్ గడ్డతండా సమీపంలో శుభంకరి వృద్ధగోశాలలో తండాకు చెందిన నునావత్ లాల్యా(48) పని చేస్తున్నాడు. సరిగా పనిచేయడం లేదని గత నెలలో తీసివేయగా కుటుంబ సభ్యులు వెళ్లి మాట్లాడటంతో నిర్వాహకులు మళ్లీ పనిలో చేర్చుకున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి గోశాలకు వెళ్లిన లాల్యా ఉదయం ఇంటికి రాకపోడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. గోశాల సూపర్ వైజర్, నిర్వాహకులు వేధింపులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

తొగుట మండలంలో ఘటన




ఈత చెట్టు వద్ద పడిపోయిన మల్లేశం

తొగుట(దుబ్బాక): ఈత చెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబీకుల కథనం మేరకు .. గ్రామానికి చెందిన సిలివేరి మల్లేశం గౌడ్ (54) కులవృత్తిలో భాగంగా శనివారం సాయంత్రం ఈత చెట్లు గీసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత చెట్టు పైకి ఎక్కి గీస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లేశం గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితిని గమనించిన తోటి కార్మికులు చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన మల్లేశం గౌడ్ మృతితో కుటుంబం అనాధగా మారిందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుడికి భార్య లలిత, కుమాలు హరీశ్, రాజు, కిషోర్ ఉన్నారు.

వైద్యం వికటించి వివాహిత..

ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన



మాధవి(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): వైద్యం వికటించి వివాహిత మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లికి చెందిన వివాహిత వంగరి మాధవి(28) అనారోగ్యంతో ఇటీవలె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యం వికటించడంతో కోమాలోకి వెళ్లింది. వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా శనివారం తుదిశ్వాస విడిచింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మాధవి చనిపోయిందని కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. ఈ క్రమంలో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలు మాధవికి భర్త విజయ్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉత్సాహంగా హ్యాండ్ బాల్ పోటీలు



తలపడుతున్న బాలికల జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

రెండో రోజు హోరాహోరీగా తలపడిన జట్లు

హుస్నాబాద్: స్థానిక మినీ స్టేడియంలో కొనసాగుతున్న 98వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పాఠశాలల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14 బాల బాలికల విభాగంలో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటుతున్నారు. రెండో రోజు నిర్వహించిన లీగ్ మ్యాచుల్లో గెలుపొందిన జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఆదివారం ఉదయం ఫైనల్ మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీల పరిశీలకుడు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన ప్రతిభ చాటిన క్రీడాకారులను 25 నుంచి 29వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మూడు రోజులపాటు 48 మ్యాచ్‌లు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బండారి మనీల, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ఆర్గనైజర్ శ్రీనివాస్, పీడీలు జంగపల్లి వెంకట నర్సయ్య, బూట్ల రాజమల్లయ్య, సత్యనారాయణ రెడ్డి, రాజా రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట యువ జ్యోతి స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో ప్రతిభ చూపి శరత్ చంద్ర, భాను మనోహర్ రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థులను మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, యువ జ్యోతి ఫుట్‌బాల్ అకాడమీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడల్లో మండలంలోని మానెపల్లి విద్యార్థులు సత్తా చాటారు. వాలీబాల్ అండర్–14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రెండో బహుమతి అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం కౌసల్య పేర్కొన్నారు. అదే విధంగా జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చాటిన నందిని అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు ఆమోస్, ఆజామ్, పీనా, శ్రీనివాస్, సరళ, పోచయ్య, యాదగిరి, నరేందర్‌రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సుమతి



విద్యార్థిని సుమతి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం పాఠశాల విద్యార్థి సుమతి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పందరినాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లో 6, 7, 8వ తేదీలలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు జరిగాయి. అలాగే 17 నుంచి 21వ తేదీ వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ యోగా పోటీలకు జిల్లాకు చెందిన వినయ్ ఎంపికయ్యారని సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ శనివారం తెలిపారు. అస్సాం రాష్ట్రం గౌహతిలో 11 నుంచి 14 వరకు జాతీయ యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.